క్లుప్తంగా

రేపు మండల సమావేశం

మారేడుమిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి ఎంపీపీ సార్ల లలిత కుమారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వీర కిషోర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అరకులోయ రూరల్: మండల పరిధిలోని అరకులోయ పట్టణం, రవ్వలగూడ, పానిరంగిని, అరకు సంతబయలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ డీఈఈ శివ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్‌ల మరమ్మతు పనుల కారణంగా ఆయా సమయంలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాంట్రాక్టు కార్మికులకు పే స్కేల్ అమలు చేయాలి

చింతపల్లిరూరల్: వ్యవసాయ పరిశోధన స్థానంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి కార్యాలయం గేటు వద్ద సీఐటీయూ నాయకులు సోమవారం నిరసన చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ వ్యవసాయ పరిశోధన స్థానంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పేస్కేల్ అమలు చేయాలన్నారు. రాజేశ్వరి, అర్జున్ తదితరులున్నారు.

ఉత్తమ ఫలితాలకు కృషి



టేకులవీధి ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ప్రజాప్రతినిధులు

గంగవరం: టేకులవీధి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబిరత్నం, వైస్ ఎంపీపీ గంగాదేవి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో వారు మాట్లాడారు. ప్రత్యేక తరగతుల నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. హెచ్ఎం అప్పలనాయుడు, సిబ్బంది పాఠశాలలో పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు.

కోడి పందాల శిబిరంపై దాడి



పందెల్లో పట్టుబడిన వారితో పోలీసులు

కొయ్యూరు: కొయ్యూరు పంచాయతీ చింతవానిపాలెం సమీపంలో నిర్వహిస్తున్న కోడిపందాల శిబిరంపై పోలీసులు సోమవారం సాయంత్రం దాడి చేశారు, ఎస్ఐ రాజారావు ఆధ్వర్యంలో జరిపిన దాడుల్లో ఐదు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వెయ్యి రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. కోడిపందాలు, పేకాట ఆడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాహన తనిఖీలు

వై.రామవరం: మండల కేంద్రంలోని వారపు సంత ప్రాంతంలో ఎస్ఐ ఎం.సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. లోతట్టు ప్రాంతాల నుంచి వారపు సంతకు వచ్చి వెళ్లే వాహనాలను, రవాణా చేస్తున్న సామగ్రిని సోదా చేశారు. వాహన రికార్డులు లైసెన్స్‌లు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సీఐ వై.రాంబాబు ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. స్టేషన్ సిబ్బందితో పాటు సీఆర్‌పీఎఫ్ డి–42 బెటాలియన్ పోలీసులు ఉన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి మాధవ్

అనంతగిరి: మండల కేంద్రంలోని బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి మాధవ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావుతో కలిసి సోమవారం ప్రచారం చేశారు. ఈ మేరకు గిరిజన సంక్షేమ బాలికలు–1, 2, కొత్తవలస ఉపాధ్యాయులను కలిసి మద్దతు ఇవ్వాలని కోరారు. ఉమామహేశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

లాభసాటిగా వేసవి పంటలు



కిమ్మిలిగెడ్డలో మొక్కజొన్న తోట



అమీనాబాద్‌కాలనీలో క్యాలీఫ్లవర్ పంట

- విస్తారంగా మొక్కజొన్న, మినుము, క్యాబేజీ సాగు
- ఆశాజనకంగా దిగుబడులు
- గిట్టుబాటు ధరలు
- ఆనందంలో రైతులు

రాజవొమ్మంగి: ప్రస్తుతం మండల వ్యాప్తంగా వేసవి పంటల సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. తొలకరి పంట చేతికందిన తరువాత రైతులు మొక్కజొన్న, మినుము తదితర పంటల సాగుపై దృష్టి సారించారు. తొలకరి పూర్తయిన తరువాత పొలాల్లో దుక్కులు చేపట్టి భూ సారం పోకుండా కూరగాయలతో పాటు మొక్కజొన్న, మినుము, పెసర, మిర్చి, క్యాలీఫ్లవర్, క్యాబేజీ, టమాటా, వంగ, మునగతో పాటు ఆకు కూరలైన తోటకూర, కొత్తిమీర, ఆనప, పొగాకు, మల్బరీ తదితర పంటలు పండిస్తున్నారు. మూడు కాలాల్లో పంటలు సాగు చేస్తూ పలువురు రైతులు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. పలువురుకి ఆదర్శంగా నిలుస్తున్నారు. మండలంలోని అమీనాబాద్, అమ్మిరేఖల, కిమ్మిగిగెడ్డ, వట్టిగెడ్డ తదితర ప్రాంతాల్లో సుమారు 50 ఎకరాలకు పైగా వేసవి పంటలు సాగులో ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో పంట చేతికందక, మరికొన్ని చోట్ల పంట చివరి దశలో ఉంది. ఈ నేపథ్యంలో అమీనాబాద్ కాలనీలో సుంకర విశ్వేశ్వరరావు అనే రైతు క్యాలీఫ్లవర్ వేసి అతి పెద్ద పూలను పూయిస్తున్నారు. ఒక్కో క్యాబేజీ మార్కెట్‌లో రూ.15 పలుకుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. మండలంలోని అమ్మిరేఖల గ్రామానికి చెందిన కొట్టేటి రాజు అనే రైతు రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తు మంచి లాభాలు ఆర్జిస్తున్నాడు. తాను గతంలోతవ్విన చెరువు నుంచి ఆయిల్ ఇంజన్ పెట్టి మొక్కజొన్నకు సాగునీరు అందిస్తున్నాడు. స్ప్రింక్లర్ల ద్వారా కూడా నీరు అందజేస్తు పెద్ద పెద్ద మొక్కజొన్న పొత్తులను పండిస్తున్నాడు. అయితే రెండు ఎకరాల్లోను ఒకేసారి విత్తనం నాటలేదని, అర ఎకరం చొప్పున అంచెలంచెలుగా ఈ పంట వేశానన్నాడు. దశల వారీగా పంట దిగుబడి వస్తుండడంతో నష్టాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నానని చెప్పాడు. మార్కెట్‌లో మంచి ధరలు ఉండడంతో లాభాలు వస్తున్నాయని చెబుతున్నారు. అదే గ్రామంలో రసూల్ అనే రైతు తోట కూర తదితర ఆకుకూరలు పండిస్తు లాభాలార్జిస్తున్నాడు. అందుబాటులో నీటి వనరులను ఉపయోగించి వేసవి పంటలు సాగు చేస్తు మన్యం రైతులు ఆదర్శ రైతులు అవుతున్నారు. ఆహార కొరతను తీరుస్తున్నారు. వేసవి పంటలతో రైతులు లాభాలు పొందవచ్చని వ్యవసాయధికారులు సూచిస్తున్నారు. వాతావరణం అనుకూలించడంతో పాటు తెగుళ్ల వ్యాప్తి తక్కువగా ఉంటుందని, సాగునీటికి ప్రస్తుతం ఇబ్బందులు ఉండవని, దీంతో పంట తక్కువ సమయంలో దిగుబడి వస్తుందని చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వడానికి సిబ్బంది అన్నివేళల్లో అందుబాటులో ఉంటారని, సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

సీతంరాజు సుధాకర్ గెలుపునకు కృషి



అరకులోయలో ప్రచారం చేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పార్టీ శ్రేణులు

అరకులోయ రూరల్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా అందరూ సమష్టిగా పనిచేయాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పిలుపునిచ్చారు. అరకులోయలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పార్టీ బలపర్చిన సుధాకర్ గెలుపునకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ మేరకు గ్రామాల్లో పర్యటించి, విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. అర్హులందరూ ఓటు వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీగా సుధాకర్‌ను గెలిపించాలని ఇందుకోసం పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. వైస్ ఎంపీపీ రామన్న, మండల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్, నాయకులు, రఘునాథ్, బాబూరావు, కిరణ్, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి



కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ బేబిరత్నం, ఎంపీపీ కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ గంగాదేవి

గంగవరం: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలని జెడ్పీటీసీ సభ్యురాలు బేబిరత్నం, ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి చెప్పారు. సూరంపాలెం గ్రామంలోని భవిత సేవా సంస్థ, భవిత ఎడ్యుకేషనల్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రభుదాసు ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. సర్పంచ్ బల్లెం శివదొర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ బేబిరత్నం మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ గంగాదేవి మాట్లాడుతూ స్థానిక సర్పంచ్‌తో పాటు స్వచ్ఛంద సంస్థ సేవలను కొనియాడారు. భవిత ఎడ్యుకేషనల్ సేవా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రభుదాసు మాట్లాడుతూ ఏజెన్సీలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా గిరిజన మహిళలు, యువతకు స్వయం ఉపాధి కార్యక్రమాలు చేపడుతున్నామని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సూరంపాలెం పంచాయతీ పరిధిలో నాలుగు గ్రామాలకు చెందిన 50 మంది గిరిజన మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి అజయ్, పాస్టర్ చిన్నాలదొర, ట్రైనర్ మణి, గ్రామ వలంటీర్లు, సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

టోర్నీ విజేతలకు బహుమతులు



షటిల్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులు, నగదు అందజేస్తున్న నిర్వాహకులు

పాడేరు రూరల్ : పాడేరు పట్టణంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన షటిల్ టోర్నీలో విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. ఈ టోర్నీలో ప్రథమ స్థానంలో మంజరి అప్పలనాయుడు, ఎస్.శివశంకర్ నిలిచారు. వీరికి రూ.10,116ల నగదు, షీల్డ్, స్వామి వారి చిత్రపటాన్ని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి పి.శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన కిల్లో భీమరాజు, పలాసి కిరణ్‌కు రూ.8వేల నగదు, షీల్డ్, స్వామి వారి చిత్రపటాన్ని ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు అందజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు కొట్టగుళ్లి సుబ్బారావు, ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు కొట్టగుళ్లి రామారావు, రమేష్‌నాయుడు, ముకుందరావు, శోభా అప్పన్న, ప్రధాన కార్యదర్శులు వెంకటరత్నం, శ్రీనివాసరావు, బాలన్న, బాబూరావు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గృహ సారథులు, కన్వీనర్లతో సమావేశం

జి.మాడుగుల: మండలంలోని ఉరుము గ్రామంలో సర్పంచ్ కిముడు రాంబాబు ఇంటి వద్ద మంగళవారం ఉదయం11 గంటలకు కొత్తగా నియమించిన గృహ సారథులు, కన్వీనర్లుకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు, మండల కన్వీనర్ కళ్యాణ్ చెప్పారు. కార్యక్రమానికి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. ట్రైకార్ ఛైర్మన్, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఏఎంసీ ఛైర్మన్, సభ్యులు, పార్టీ ముఖ్యనాయకులు విచ్చేస్తారన్నారు. మండలంలో గల గృహ సారథులు, కన్వీనర్లు, గ్రామ వలంటీర్లు, పార్టీ అభిమానులు హాజరుకావాలని వారు కోరారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనూషదేవి

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలో సోమవారం ఎంపీపీ అనూషదేవి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సర్పంచులు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులతో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాత్రి సమయంలో వైద్యులు అందుబాటులో తప్పనిసరిగా ఉండాలని, లేకపోతె తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలు అరికట్టాలని, శిథిలదశకు చేరిన విద్యుత్ స్తంభాలు తదితర సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో అర్హులకు జాబ్‌కార్డులు అందజేయాలని సూచించారు. ఎంపీడీవో లాలం సీతయ్య, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజులమ్మ, పీఆర్ జేఈ బాల కిషోర్, ఎస్ఎంఐ జేఈ లోకేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వర్ణలత, ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు రస్కిన్ మృతికి నివాళి



రస్కిన్ (ఫైల్)



రస్కిన్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

మోతుగూడెం: గుండెపోటుతో సీనియర్ ఉపాధ్యాయుడు మృతి చెందారు. రంపచోడవరానికి చెందిన ఎంటీఎస్ రస్కిన్ చింతూరు మండలం మోతుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో గణితశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సమయంలో హఠాత్తుగా గుండెపోటు రావడంతో తోటి ఉపాధ్యాయులు అంబులెన్స్‌లో జెనోకో ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ అరుణ్‌కుమార్, సిబ్బంది ప్రాణాలు కాపడడానికి శాయశక్తులా కృషి చేసిన ప్రాణాలు నిలబడలేదు. ఆయన 2015 నుంచి 2018 వరకు చింతూరు మండలం ఎంఈఓగా పని చేశారు. ఆయనకు ఇద్దరు ఆడపిల్లలున్నారు. రస్కిన్ మృతిపై సహచర ఉపాధ్యాయులు ప్రసాద్, దొర, కవిత, కబ్బారావు, కర్ణారెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

రస్కిన్‌కు నివాళి

రంపచోడవరం: సీనియర్ ఉపాధ్యాయుడు, యూటిఎఫ్ నాయకుడు రస్కిన్ మృతి తీరని లోటు అని ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు అన్నారు. రంపచోడవరంలో సోమవారం రస్కిన్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. యూటిఎఫ్ నాయకుడుగా ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పనిచేశారని గుర్తు చేశారు. ఆదివాసీ హక్కుల వేదిక సంఘం నాయకుడు వరప్రసాద్‌రావు, హెచ్ఎం ముత్యాలరావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనలు పాటించాలి



ఫ్లెక్సీ తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కొయ్యూరు: ఉత్తరాంధ్రా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో ఎన్నికల ప్రవర్తన నియామవళిని అనుసరించి రాజకీయ నేతల ఫ్లెక్సీలు, బ్యానర్‌లను తొలగిస్తున్నారు. రాజేంద్రపాలెంలో సోమవారం వీఆర్‌వో సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది మెయిన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన వివిధ పార్టీ నేతల ఫ్లెక్సీలను తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ తిరుమలరావు మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియామవళిని అనుసరించి మండలంలో ఎక్కడ ఫ్లెక్సీలున్నా వాటిని తొలగిస్తామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజకీయ నేతలు ఎమ్మెల్సీ ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలన్నారు. రాజకీయ నేతల ఫ్లెక్సీల తొలగింపుపై సిబ్బందికి ఆదేశాలిచ్చామన్నారు.

విజేతలకు అభినందనలు



విజేతలతో జెన్‌కో సీఈ శ్రీధర్

మోతుగూడెం: ఏపీ జెన్‌కో తిరుపతి ఆపరేషన్ సర్కిల్ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు మూడు రోజులు పాటు తిరుపతిలో ఉద్యోగులకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పోటీల్లో స్థానిక జెన్‌కో ఉద్యోగులు ఉత్తమ ప్రతిభ కనబరిచిన విషయం తెలిసిందే. ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజినీర్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో లోయర్ సీలేరు క్రీడాకారులను స్పోర్ట్స్ కౌన్సిల్ ఛైర్మన్, సీఈ బి.శ్రీధర్ అభినందనలు తెలిపారు. స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్ఈ వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ ఈఈ బాబూరావు, జనరల్ సెక్రటరీ డీఈ భీమారావు, బాలకృష్ణ, సతీష్‌రాఘవన్ తదితరులు ఆయా క్రీడాకారులను అభినందించారు. జెన్‌కో ఉద్యోగుల, క్రీడాకారులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు వ్యాక్సినేషన్



వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

డుంబ్రిగుడ: కొర్రాయి పంచాయతీ గుంజిరిగుడ, కొత్తవలస, బొందుగుడ, బల్లుగుడ, గత్తరజిల్లెడ, కొసిగుడ, కాంగువలస గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి గౌతమ్ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో 489–గొర్రెలు, 518–మేకలకు పీపీఆర్ వ్యాక్సిన్ వేసినట్టు చెప్పారు. పశువులు వ్యాధు ల బారిన పడకుండా వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. సిబ్బంది మహేష్, త్రినాథరావు, మహేష్, సంజీవ్, మనోజ్, అప్పారావు, అనంతరావు, రత్నం, బాలు, ప్రకాష్, రమేష్, జయరాజు, జానకి పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు సరికాదు

కొయ్యూరు: తనపై తప్పుడు, నిరాధార ఆరోపణలు చేయడం, నిందలు వేయడం తగదని జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు చెప్పారు.ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ భూములు ఆక్రమించినట్టు తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్న ఆదివాసీ జేఏసీ నేతలు రామారావు దొర, వరలక్ష్మి నిరూపించాలని లేనిపక్షంలో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తానన్నారు.

45 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శశికాంత్

జి.మాడుగుల: మండలంలోని కోరాపల్లి గ్రామ సచివాలయం పరిధిలో అరగడాపల్లి గ్రామంలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి శశికాంత్ మాట్లాడుతూ శిబిరంలో 45 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశామన్నారు. ఆరుగురు జ్వర పీడితులకు రక్తపూతలు సేకరించి ఆర్‌డీటీ చేశామన్నారు. గ్రామంలో ఇటీవల మృతి చెందిన కొర్ర కవిత కుటుంబంలో అనారోగ్యంతో ఉన్న మృతురాలి తల్లి, తమ్ముడు, చెల్లికి మెరుగైన వైద్యం సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్ సహాయంతో పీహెచ్‌సీలో చేర్పించినందుకు వైద్యులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీహెచ్‌ఈవో ఎన్.ప్రకాష్, హెల్త్ అసిస్టెంట్ ఆర్.శోభన్‌బాబు, సిబ్బంది కృష్ణకుమారి, మంగమ్మ, సంధ్యారాణి పాల్గొన్నారు.

జీడి, మామిడి రైతుకు మంచు గుబులు

- పూతకు నష్టం జరిగే అవకాశం
- ఆందోళన చెందుతున్న రైతులు
- గతేడాది కాపులేక నష్టం



మామిడిచెట్టుకు విరగ్గాసిన పూత



జీడిమామిడి తోటలపై కురుస్తున్న మంచు

రాజవొమ్మంగి: వేసవి అరుదెంచినా మన్యంలో ఉదయం పూట దట్టంగా కురుస్తున్న మంచు మామిడి, జీడిమామిడి పంటలకు ఆశనిపాతం అవుతోంది. ప్రస్తుతం మామిడి జీడిమామిడి విరగబూశాయి.

ఇక పిందెలు ఏర్పడే దశలో కురుస్తున్న దట్టమైన మంచు పూత పిందెలకు కూడా నష్టం కలిగిస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది కాపులేక జీడిమామిడి రైతు కుదేలయ్యారు. ఎకరాకు 6 నుంచి 5 బస్తాల (బస్తా 80 కిలోలు) దిగుబడిని ఆశించిన రైతు ఒకటి రెండు బస్తాలతోనే సరిపెట్టుకొన్నాడు.

ఈ ఏడాది పూత బాగుంది, గత ఏడాది నష్టాన్ని ఈ ఏడాది పంట భర్తీ అవుతుందన్న రైతుల ఆశలను దట్టంగా కురుస్తున్న మంచు అడియాసలు చేస్తోంది. రాజవొమ్మంగి పరిసరాల్లో సోమవారం ఉదయం 9 గంటల వరకు దట్టంగా మంచు అలముకొంది. దీంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. విపరీతంగా కురుస్తున్న మంచు వల్ల పూత మాడిపోకుండా క్లోరిఫైర్‌పాస్ 2 ఎంఎల్. కార్బండిజమ్ పొడి మందు 1 గ్రాము ఒక లీటరు నీటితో పిచికారీ చేయాలని రంపచోడవరం హార్టీకల్చర్ అధికారి ఎన్.రమేష్ సూచించారు.

ఆశాజనకంగా మామిడిపూత

డుంబ్రిగుడ: మండలంలోని పలు గ్రామాల్లో మామిడిపూత ఆశాజనకంగా ఉంది. చెట్టంతా పువ్వు విరబూయడంతో రైతుల్లో ఆశలు రేకెత్తిస్తోంది. మామిడి పూతలో సగం నిలబడినా గత ఏడాది కంటే ఈ ఏడాది దిగుబడి బాగుంటుందని రైతులు ఆశిస్తున్నారు. వర్షం పడితే మరి ఎక్కువ మామిడి పూత వస్తుందని రైతులు చెబుతున్నారు. మామిడి దిగుబడి బాగుంటే లాభాలు వస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కుంభా రవిబాబు ఎంపికపై హర్షం



అరకులోయలో స్వీట్లు పంపిణీ చేస్తున్న పార్టీ శ్రేణులు

పాడేరు రూరల్/అనంతగిరి/అరకులోయ రూరల్/డుంబ్రిగుడ/హుకుంపేట/పెదబయలు: శాసన మండలికి నూతన సభ్యుల ఎంపికలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మన్యంలోని ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశం కల్పిస్తూ సిఫార్సు చేయడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబును సిఫార్సు చేయడంపై గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా అరకులోయ, అనంతగిరి, హుకుంపేట, డుంబ్రిగుడ, పెదబయలు, పాడేరు తదితర ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచిపెట్టారు. పాడేరులో జరిగిన వేడుకలో మండల పార్టీ అధ్యక్షుడు సింహాచలం, ఎంపీటీసీ రామకృష్ణపాత్రుడు, సర్పంచ్ చిట్టమ్మ, మాజీ ఎంపీపీ రమణమూర్తి, నాయకులు పాల్గొన్నారు. సత్యనారాయణ, లక్ష్మోజి, బాబురావు తదితరులు పాల్గొన్నారు. అరకులోయలో ఎంపీటీసీ సభ్యుడు ఆనంద్‌కుమార్, నాయకులు చిన్నారావు, సూర్యప్రకాష్, భాస్కరరావు, పల్టాసింగ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. హుకుంపేటలో సర్పంచ్‌లు రమేష్, సన్నిబాబు, పోతురాజు, ఎంపీటీసీ సభ్యుడు హరి, నాయకులు కాసులమ్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. డుంబ్రిగుడలో నాయకులు రామనాయుడు, పరశురాం,పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కొములునాయుడు తదితరులు పాల్గొన్నారు.పెదబయలులో జెడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబు, సర్పంచ్‌లు సురేష్‌కుమార్, లోయితాస్, నాయకులు సూర్యనారాయణ, సూరయ్య, తమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ తెగకు ప్రాధాన్యం హర్షణీయం: ట్రైకార్ ఛైర్మన్ బుల్లిబాబు

ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబుకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా సిఫార్సు చేయడం హర్షణీయమని ట్రైకార్ ఛైర్మన్ సతక బుల్లిబాబు అన్నారు. పాడేరులో పార్టీ శ్రేణులు సోమవారం నిర్వహించిన వేడుకలో ఆయన పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతోందన్నారు. అనంతగిరిలో ఎస్టీ కమిషన్ సభ్యురాలు రామలక్ష్మి విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనులకు ప్రత్యేక స్థానం కల్పించడం హర్షణీయమన్నారు.